ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

సోమవారం 13 అక్టోబరు 2025



పలు రైళ్లు రద్దు

ఇచ్ఛాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రైల్వే పనుల నేపథ్యంలో పలు రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటన విడుదల చేశారని డీఆర్‌యూసీసీ మెంబర్ కట్టా సూర్యప్రకాష్ తెలిపారు. సోమవారం విశాఖపట్నం-బరంపురం ఎక్స్‌ప్రెస్(18526), విశాఖపట్నం-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్(22820), విశాఖపట్నం- బరంపురం పాసింజర్(58532) రైళ్లు రద్దయ్యాయన్నారు. మంగళవారం బరంపురం-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు(18525), భువనేశ్వర్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్(22819), బరంపురం-విశాఖప్నం పాసింజర్ ఎక్స్‌ప్రెస్(58531) రద్దయ్యాయని వివరించారు.

ఆ గ్రామానికి 'ఏమైంది?

- కృష్ణాపురాన్ని పీడిస్తున్న కిడ్నీ వ్యాధి
- మూడేళ్లలో 25 మంది మృతి
- పదుల సంఖ్యలో బాధితులు
- ఆందోళనలో గ్రామస్థులు



కృష్ణాపురం గ్రామం

పొందూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడు ఆ గ్రామం ఎంతో ప్రశాంతంగా ఉండేది. వ్యవసాయంతో పాటు, క్వారీల్లో పనిచేసి ఆ వచ్చిన సంపాదనతో గ్రామస్థులు ఆనందంగా జీవించేవారు. అలాంటి గ్రామాన్ని మూడేళ్ల నుంచి కిడ్నీ వ్యాధి పట్టిపీడిస్తోంది. ఈ మహమ్మారితో మూడేళ్లలో 25 మంది మృతి చెందగా, పదుల సంఖ్యలో రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇదీ పొందూరు మండలం కృష్ణాపురం (గారపేట) గ్రామంలోని పరిస్థితి. ఈ గ్రామంలో 2వేల మంది జనాభా నివసిస్తున్నారు. మూడేళ్ల కిందట గ్రామంలో కిడ్నీ వ్యాధి వెలుగుచూసింది. అప్పటి నుంచి చిన్న పెద్ద తేడాలేకుండా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. చికిత్సకు రూ.లక్షలు వెచ్చించాల్సి రావడంతో కొన్ని కుటుంబాలు అప్పులపాలయ్యాయి. ఆసుపత్రులు చుట్టూ తిరిగినా వ్యాధి ముదిరి డయాలసిస్‌కు దారితీయడం, ఆ తరువాత కొన్ని నెలలకే మృత్యువాత పడుతుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. 2019లో కాయల శ్రీను(35) అనే వ్యక్తి ఈ వ్యాధి బారిన పడి మృతిచెందాడు. అప్పటి నుంచి ప్రతీ ఏడాది కిడ్నీ మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. పది రోజుల కిందట గార వెంకటమ్మ అనే వివాహిత ఈ వ్యాధితో మృతి చెందింది. ఈ మూడేళ్లలో 25 మంది మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది. ఎవరికి ఎప్పుడు ఈ లక్షణాలు బయట పడతాయోనని గ్రామస్థులు భయం గుప్పెట్లో బతుకుతున్నారు. ప్రస్తుతం గార రమణ, పిసిని రామారావు తదితరులు ఈ సమస్యతో బాధపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే మరో ఉద్దానంగా మారినా ఆశ్చర్యం లేదని గ్రామస్థులు అంటున్నారు.

కారణాలేంటో?

కృష్ణాపురం గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలడానికి అసలు కారణాలు తెలియడం లేదు. అధికారులు ఇటీవల గ్రామంలో నీటి పరీక్షలు చేసి కాలుష్యం లేదని తేల్చారు. కానీ, వ్యాధికి గల కారణాలపై మాత్రం పరిశోధనలు చేయలేదు. తూతూ మంత్రంగా నీటి పరీక్షలు చేసి మమ అనిపించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న స్టోన్ క్రషర్లు కిడ్నీ వ్యాధికి కారణం కావచ్చని వైద్య నిపుణులు అను మానిస్తున్నారు. స్టోన్‌క్రషర్ల నుంచి వచ్చే పౌడర్ చాలా ప్రమాదకరమని వారు హెచ్చరిస్తున్నారు. మండలం లోని కొంచాడలో కూడా కిడ్నీ వ్యాధి గ్రస్థులు ఉన్నారు. ఈ గ్రామం చుట్టూ క్రషర్లు ఉండడంతోనే ఆ గ్రామస్థులు కిడ్నీ వ్యాధిబారిన పడుతున్నారని, అదే సమస్య కృష్ణాపురం గ్రామానికి వచ్చిందని పలువురు చెబుతున్నారు.

వైద్య పరీక్షలు చేయాలి

మా గ్రామంలో కిడ్నీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామస్థులందరికీ సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించాలి. రోగ లక్షణాలు ఉన్నవారికి మెరుగైన వైద్యం అందించి ఉచితంగా మందులు అందించాలి.

- అంబల్ల శ్రీనివాసరావు, కృష్ణాపురం

కారణాలు వెలికితీయాలి

మా గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలి పదుల సంఖ్యలో చనిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు తూతూ మంత్రంగా నీటి పరీక్షలు చేసి వదిలేశారు. పూర్తి స్థాయిలో నీటి పరీక్షల చేయడంతో పాటు సమస్యకు కారణాలను వెలికితీయాలి.

- గార వెంకటరమణ, మాజీ సర్పంచ్, కృష్ణాపురం

చర్యలు తీసుకుంటాం

ఇప్పటికే కృష్ణాపురంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి నీటి పరీక్షలు చేశాం. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించాం. పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించి సమస్యకు పరిష్కారం చూపుతాం.

-డాక్టర్ అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం



కొత్త ఉపాధ్యాయులు వచ్చేస్తున్నారు

- నేడు జిల్లాలో 528 మంది విధుల్లో చేరిక

నరసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలల్లో కొత్త ఉపాధ్యాయులు వస్తున్నారు. సోమవారం జిల్లాలో 528 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు. మెగా డీఎస్సీ అర్హత సాధించిన ఉపాధ్యాయులకు గత నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. జిల్లాలోని కొత్త ఉపాధ్యాయులకు శ్రీకాకుళంలో ఈ నెల 3 నుంచి 10వరకు విద్యారంగంలో బోధనా పద్ధతులు, సాంకేతికత వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఆన్‌లైన్ ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించారు. లీప్ యాప్‌లోనే వారికి పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేశారు. వీరంతా సోమవారం విధుల్లో చేరనుండడంతో విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

నేటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఏ-2 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదోతరగతి వరకు ఉదయం 9.30 నుంచి 10-45 వరకు, మధ్యాహ్నం 1-15 నుంచి 2-30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇవి మూడు రోజులు కొనసాగనున్నాయి. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులకు ఉదయం రెండు, మధ్యాహ్నం రెండు చొప్పున సబ్జెక్టుల వారీగా పరీక్షలు నాలుగు రోజులు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో ప్రశ్నపత్రాలు ముద్రించి మండల కేంద్రాలకు పంపిణీ చేశారు. ప్రాథమిక పరీక్షల ప్రశ్నపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్‌లకు, ఆరో తరగతి నుంచి పదోతరగతి ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలలో భద్రపరిచారు. ఏరోజు పరీక్ష ప్రశ్నపత్రాలను ఆరోజే గంట ముందు మాత్రమే సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు లేదా టీచర్లు తీసుకెళ్లాలని డీఈవో రవిబాబు తెలిపారు.

నీరుపయోగమే!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేయని ఆర్వో ప్లాంట్లు
- వైసీపీ హయాంలో నాసిరకం యంత్రాలు ఏర్పాటు
- కొద్దినెలల్లోనే పాడైనా.. కానరాని మరమ్మతులు
- చిన్నారులకు తప్పని తాగునీటి ఇబ్బందులు



- మెళియాపుట్టి మండలం పరశురాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో 15మంది పిల్లలు ఉన్నారు. రెండేళ్ల కిందట పిల్లలకు మంచినీరు ఇచ్చేందుకుగానూ ఈ కేంద్రంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అది ఆరునెలల్లోనే పాడైపోయింది. అప్పటి నుంచీ మరమ్మతులు చేపట్టలేదు. దీంతో చిన్నారులు ఇంటి నుంచే బాటిళ్లలో తాగునీరు తెచ్చుకుంటున్నారు.

- మెళియాపుట్టి మండలం సుర్జుణి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 10మంది చిన్నారులు ఉన్నారు. ఈ కేంద్రంలో రెండేళ్ల కిందట ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయగా.. కొద్దిరోజుల్లోనే పాడైంది. మరమ్మతులు చేయక మూలకు చేరింది.



- పాతపట్నం నియోజక వర్గంలో సుమారు 455 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 72 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిలో అధికంగా పాడైపోవడంతో చిన్నారులకు సురక్షిత నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

మెళియాపుట్టి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కాగా.. నాసిరకం యంత్రాలు కావడంతో ఏర్పాటు చేసిన కొద్దిరోజుల్లోనే చాలా కేంద్రాల్లో ఆర్వోప్లాంట్లు పాడైపోయాయి. ఆర్వో ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను విశాఖకు చెందిన ఒక ఏజెన్సీకి అప్పగించారు. రెండేళ్లపాటు నిర్వహణ బాధ్యత చూసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా.. ఆర్వోప్లాంట్లు బిగించిన ఆరునెలలకే చాలాచోట్ల పాడైపోయినా.. ఆ ఏజెన్సీ నిర్వాహకులు మరమ్మతులు చేపట్టలేదు. గత ప్రభుత్వమూ పట్టించుకోలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వోప్లాంట్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 16 ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు 44,862 మంది ఉన్నారు. చిన్నారులకు సురక్షిత నీరు అందించేందుకుగానూ సుమారు 1,500 కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వీటిలో చాలా ఆర్వో ప్లాంట్లు పనిచేయక.. అలంకారప్రాయంగా మిగిలాయి. ఆయా కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులు సురక్షిత నీరు అందని దుస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీరు కలుషితమవుతోంది. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గురుకులంలో తాగునీరు కలుషితమై విద్యార్థులు ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సురక్షిత నీరు అందక చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది ఇళ్ల నుంచి బాటిళ్లతో నీటిని పంపించినా.. అవి చాలక కలుషిత నీటిని తాగే (మిగతా 7వ పేజీలో..)

నేటి నుంచి జీఎస్టీ వారోత్సవాలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 విజయోత్సవాలను పురస్కరించుకుని 'సూపర్ జీఎస్టీ... సూపర్ పొదుపు' పేరుతో ఈ నెల 13 నుంచి 19 వరకు స్థానిక ఎన్టీఆర్ మునిసిపల్ మైదానంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జీఎస్టీ వలన కలిగే పొదుపు లాభాలను తెలుసుకునేందుకు ప్రతీ స్టాల్‌లో జీఎస్టీ ధర, పొదుపు శాతం తదితర వివరాలను ప్రదర్శిస్తాం. ఆటోమొబైల్, నిత్యావసర వస్తువులు, ఫోన్లు, పొందూరు చేనేత వస్త్రాలు, హస్త కళల వస్తువులు తదితర స్టాళ్లు ఏర్పాటు చేస్తాం. సోలార్ పరికరాలు, ఫుడ్ కోర్టులు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా సామగ్రి, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉత్పత్తుల స్టాళ్లు ప్రదర్శిస్తాం. జీఎస్టీ ప్రయోజనాలను తెలుసుకునేందు పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ వారోత్సవాల్లో పాల్గొనాల'ని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నేడు జిల్లాకు మంత్రి నాదెండ్ల రాక

- పౌరసరఫరాల శాఖపై ప్రాంతీయ సమావేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోమవారం జిల్లాకు రానున్నారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాలశాఖపై ప్రాంతీయ సమావేశం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారని ఆ శాఖ మేనేజర్ వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో జిల్లాతోపాటు అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో వివిధ అంశాలపై చర్చించనున్నారన్నారు. అలాగే స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 3గంటలకు మిల్లర్స్ అసోసియేషన్, ధాన్యం సేకరణ సంస్థలు, రైతు సంఘాలతో ఏర్పాటు చేసే సమావేశంలో కూడా మంత్రి పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

- వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం 8లో

పారిశుధ్య లోపంతో అవస్థలు 7లో

- దారుణంగా రహదారులు
- తాగునీటికి ఇబ్బందులు
- ఇదీ మండపల్లి గ్రామ దుస్థితి

సత్యవరంలో తాగునీటి కష్టాలు

- ఐదురోజులుగా ట్యాంకుల ద్వారా పంపిణీ 8లో



పంచాయతీ ఉద్యోగులకు అప్‌గ్రేడ్

- నాలుగు కేటగిరీలుగా విభజన
- పదోన్నతుల కల్పనకు శ్రీకారం
- మంత్రివర్గ ఆమోదంపై హర్షం


- మెళియాపుట్టికి చెందిన అజిత్ కుమార్ మిశ్రా అనే వ్యక్తి 24 ఏళ్ల కిందట పంచాయతీరాజ్ శాఖలో టైపిస్టుగా ఉద్యోగంలో చేరారు. రెండేళ్ల కిందట ఆయన సీనియర్ సహాయకులుగా పదోన్నతి పొందారు. సీనియర్ సహాయ కుడి స్థాయికి ఎదగడానికి ఆయనకు 22 ఏళ్ల సమయం పట్టింది. ఇకనుంచి ఈ పరిస్థితి మారనుంది. పంచాయతీరాజ్ ఉద్యోగులను గ్రేడ్‌లుగా విభజించి పదోన్నతి కల్పించ నున్నారు.

టెక్కలి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):

పంచాయతీరాజ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పంచాయతీల పునర్నిర్మాణం.. పునర్ వర్గీకరణకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. 10 రకాల సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. దీపావళి కానుకగా పంచాయతీలను నాలుగు గ్రేడ్‌లుగా విభజించి ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తున్నట్లు శుక్రవారం జరిగిన కేబినెట్‌లో సమావేశంలో ప్రకటించింది. పంచాయతీ ఉద్యోగులకు గత 48 ఏళ్ల నుంచి పదోన్నతుల చానల్ లేదు. మిగతా శాఖల్లో పనిచేసే వారికి ముందుగానే పదోన్నతులు వస్తుంటాయి. ఈ పరిస్థితి పంచాయతీరాజ్‌శాఖలో లేదు. దీంతో ఈ శాఖకు రావడానికి ఉద్యోగులు ఇష్టపడేవారు కాదు. ఈ సమస్యను ఇటీవల డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి కొందరు ఉద్యోగులు తీసుకెళ్లారు. దీంతో వివిధ సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీలను జనాభా, ఆదాయం ఆధారంగా స్పెషల్ (రూర్బన్) గ్రేడ్, గ్రేడ్ -1, గ్రేడ్ -2, గ్రేడ్ -3లుగా విభజించి పాలన అందించనుంది. ఇక పంచాయతీ కార్యదర్శిలు పంచాయతీ అభివృద్ధి అధికారులుగా వ్యవహరించనున్నారు. 48 ఏళ్ల తరువాత పంచాయతీరాజ్‌శాఖలో ప్రక్షాళన జరుగుతుండడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 912 పంచాయతీల పరిధిలో 835 సచివాలయాలు ఉన్నాయి. అన్ని గ్రేడ్ల కార్యదర్శిలు 2,044 మందికిగానూ 1,804 మంది ఉన్నారు. గ్రేడ్-1 కార్యదర్శిలు 33 మందికి గాను 11 మంది, గ్రేడ్-2 కార్యదర్శిలు 22 మందికి 18 మంది, గ్రేడ్-3 కార్యదర్శిలు 129 మందికి 115 మంది, గ్రేడ్-4కు సంబంధించి 498 మంది (మిగతా 7వ పేజీలో..)



ఆర్వో ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న నగరప్పాలెం గ్రామస్థులు

ఆర్వో ప్లాంట్‌కు అనుమతులివ్వొద్దు

- ముక్తకంఠంతో కోరిన నగరప్పాలెం ప్రజలు

రణస్థలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పరిరక్షించాలని, తమ ప్రాంతంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయవద్దని రణస్థలం పంచాయతీ నగరప్పాలెం ప్రజలు కోరారు. నగరపాలెంలో ఆరు ఎకరాల్లో ప్రైవేటు ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు నిర్వాహకులు ఆదివారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. సుమారు 100 మంది ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయద్దని డిమాండ్ చేశారు. 100, 150 అడుగుల్లో బోర్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్నామని, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తే వందల అడుగుల్లో నీరు తీస్తే తమ బోర్ల పరిస్థితి ఏమిటని కరిమజ్జి మల్లేశ్వరరావు, పిన్నింటి లక్ష్మునాయుడు, కరమజ్జి భాస్కర రావు, చందరక రమణ, మజ్జి రమేష్ తదితర రైతులు ప్రశ్నించారు. ఇప్పటికే చుట్టు పక్కల పరిశ్రమల వల్ల భూగర్భజలాలు అడుగంటే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంట్‌కు అనుమతులిస్తే ఊరికునేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఎప్పుడు కూలి.. ఏ ప్రమాదం జరుగుతుందో?

● శిథిలావస్థలో తండేంవలస రక్షిత నీటి పథకం

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం తండేం వలస ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న రక్షిత నీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 23 సంవత్సరాల కిందట నిర్మించిన ఈ ట్యాంకుకు మరమ్మతులు లేకపోవడంతో ఎప్పుడు కూలి, ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మెట్లు శిథిలావస్థకు చేరుకోగా ఇనుమ మెట్లు ఏర్పాటు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న రక్షిత నీటి పథకం మెట్లు

పారిశుధ్యలోపంతో అవస్థలు

● దారుణంగా రహదారులు
● తాగునీటికి ఇబ్బందులు
● ఇదీ మండపల్లి గ్రామ దుస్థితి

ఇచ్ఛాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం మండపల్లి గ్రామం అనేక సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం నుంచి జంక్షన్ వరకు రోడ్డు పలుచోట్ల గోతులుగా తయారైంది. ఏమాత్రం వర్షం కురిసినా రోజుల తరబడి నీరు గోతుల్లో నిలువ ఉండి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయాల్లో గోతులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. అలాగే గ్రామంలో కాలువల నిర్మాణం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో వ్యాధులబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగునీరు బయటకు పోయేందుకు అవకాశం లేక ఉన్న కాలువల్లో సిల్ట్ పేరుకుపోతోంది. దోమలు ఉత్పత్తి చెంది జ్వరాలబారిన పడుతున్నామని వాపోతున్నారు. పలు బోర్లు పని చేయకపోవడంతో తాగు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంబంధిత అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసు కోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.





రోడ్డుపైనే చెత్తకుప్పలు (ఇన్‌సెట్‌లో) పాడైన బోరు



గోతులుగా మారిన మండపల్లి రోడ్డు

న్యూస్ బాక్స్

పాదరక్షల పంపిణీ

ఆమదాలవలస, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని మెట్టక్కివలస శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు పాదరక్షలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి ప్రతినిధులు కన్నేపల్లి వెంకట కామావధానులు, పూసర్ల తాతయ్య, మునగవలస రవీంద్రబాబు, బలివాడ దామోదర్ పట్నాయక్ పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి). న్యూమోనియా వ్యాధితో బాధపడుతూ శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొఠారి గ్రామానికి చెందిన బండారు పావని కుమార్తె దీయా (18 నెలలు) వైద్య ఖర్చుల కోసం ఎస్‌జీఎఫ్ సేవా సమితి సభ్యులు రూ.25 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు. ప్రస్తుతం చిన్నారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చిన్నారి తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ప్రధాన మార్గంలో అంధకారం

ఇచ్ఛాపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ జంక్షన్ నుంచి మునిసి పల్ కార్యాలయం వరకు సెంటర్ డివైడర్లలో ఉన్న వీధి లైట్లు వెలగక పోవడంతో అంధకారం నెలకొంది. దీంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణం మునిసిపల్ అధికారులు స్పందించి వీధిలైట్లను ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కుక్కల దాడి: ఇద్దరికి గాయాలు

కవిటి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురంలో గత వారం రోజులుగా కుక్కల దాడిలో పలువురు గాయాల పాలయ్యారు. శనివారం రాత్రి గ్రామానికి చెందిన మోహన్ బిసాయి, ఎస్.నాగేశ్వరరావులపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. నాగేశ్వరరావుకు కాళ్ల పిక్కలతో పాటు ముక్కుపై గాయపరిచాయి. ఇప్పటివరకు 11మంది కుక్కల దాడిలో గాయాలపాలై ఆసుపత్రులకు వెళ్లారని గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడత ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాబబుల్స్ జట్టు ఖరారు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా పురుషుల ప్రాబబుల్స్ జట్టును ఖరారు చేశారు. స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఆదివారం క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఉత్తమ ఆట తీరును ప్రదర్శించిన 20 మంది క్రీడాకారులకు ప్రాబబుల్స్ జట్టులో చోటును కల్పించారు. వీరంతా ఈనెల 28 నుంచి నవంబరు 6వ తేదీ వరకు కేశవరావుపేటలో జరగనున్న శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. ఈ శిక్షణలో మెరుగైన ప్రతిభ ప్రదర్శించిన వారికి తుది జట్టులో స్థానం కల్పించనున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కూన రవి కుమార్, కార్యదర్శి సూర శ్రీనివాసరావు తెలిపారు. ఈ జట్టు గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో నవంబరు 8 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొం టారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం చీఫ్ అడ్వైజర్ పి.సుందరరావు, సాఫ్ట్ బాల్ సంఘం కన్వీనర్ ఎంవీ రమణ, ప్రతినిధులు మెట్ట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'నీరు'పయోగమే!

(ఐదో పేజీ తరువాయి)

ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్వోప్లాంట్లు మరమ్మతులు చేపట్టి.. సురక్షితనీటిని అందజేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమరావతి వద్ద ప్రస్తావించగా.. 'ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం కేంద్రాల్లో పిల్లలకు వేడినీళ్లు అందజేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆదేశించామ'ని తెలిపారు.

పంచాయతీ ఉద్యోగులకు అప్‌గ్రేడ్

(ఐదో పేజీ తరువాయి)

కార్యదర్శులకు 404 మంది, గ్రేడ్-5కి సంబంధించి 529 మందికిగాను 490 మంది, గ్రేడ్-6 కార్యదర్శులు 835 మందికి 766 మంది ఉన్నారు. వీరిని ఇక నుంచి మూడు గ్రేడ్‌లుగా విభజించి పంచాయతీ పాలన కొనసాగనుంది. మునిసిపాలిటీ తరహాలో పారిశుధ్యం, తాగునీరు, గ్రామీణ ప్రణాళిక, వీధిలైట్లు, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాలుగా విభజించనున్నారు.

ఆనందంగా ఉంది..



దాదాపు ఐదు దశాబ్దాల తరువాత పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించడం ఆనందంగా ఉంది. దీనివల్ల కార్యదర్శులకు ఎప్పుడూ లేనంతగా గౌరవం దక్కుతుంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

-శివాజీ, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు, మెళియాపుట్టి

పేస్కేల్ అమలు చేయాలి..



గ్రేడ్లగా విభజించడాన్ని కూటమి ప్రభుత్వం కార్యదర్శులకు ఇచ్చిన దీపావళి కానుకగా భావిస్తున్నాం. గ్రేడ్‌లు విభజించినట్టే వాటి ఆధారంగా పేస్కేల్ అమలు చేస్తే బాగుంటుంది. దీనివల్ల మరింత చురుగ్గా పని చేయగలుగుతాం.

-మోహనరావు, పంచాయతీ కార్యదర్శి

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు

● కొర్ని యువకుడి ప్రతిభ



రాజశేఖర్‌కు బంగారు పతకాలు అందిస్తున్న అసోసియేషన్ కార్యదర్శి లక్ష్మి

గార, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో గత మూడు రోజులుగా నిర్వహించిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొర్ని గ్రామానికి చెందిన చమళ్ల రాజశేఖర్ మూడు బంగారు పతకాలు సాధించాడు. కర్ణాటక పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరు ఎసెక్ట్ రిక్రియేషన్ హబ్ వైట్‌ఫీల్డ్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ 59 కిలోల సీనియర్స్ విభాగంలో రాజశేఖర్ మూడు బంగారు పతకాలు పొందాడు. ఆదివారం అసోసి యేషన్ కార్యదర్శి లక్ష్మి తదితర అతిథులు బహుమతి ప్రదానం చేశారు. జాతీయ పోటీల్లో బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకోవడం ఆనందంగా ఉందని రాజశేఖర్ తెలిపాడు. ఈ సందర్భంగా అతడిని గ్రామస్థులు అభినందించారు.

కల్తీ మద్యం అమ్మితే చర్యలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో కల్తీ, అక్రమంగా మద్యం విక్ర యిస్తే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ గోపాలకృష్ణ హెచ్చరించారు. ఆదివారం ఎక్సైజ్‌శాఖ శ్రీకాకుళం స్టేషన్ పరిధిలో ఉన్న 34 మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యం దుకాణాల్లో కొన్ని మద్యం బ్రాండ్లను స్పాట్ కెమికల్ టెస్ట్‌ను నిర్వహించడం జరిగిందని, వాటి శాంపిల్స్‌ను విశాఖపట్నం ల్యాబ్ కు పంపించడం జరిగిందన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐలు మహేష్, రాజేష్ పాల్గొన్నారు.

● సోంపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ జీవీ రమణ ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీ చేశారు. మందు శాంపిళ్లను విశాఖపట్నం పంపించి నాణ్యత తెలుసుకోనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు మద్యం నాణ్యతపై అనుమానాలుంటే 14405 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

● రణస్థలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మద్యం విక్రయాల్లో తప్పిదాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎల్.అనూరాధ హెచ్చరించారు. రణస్థలం ఎక్సైజ్ పరిధిలో ని మద్యం దుకాణాలను ఆదివారం సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. అక్రమ మద్యం విక్రయాలు, మద్యంలో కల్తీ వంటివి జరిగితే 14405 టోల్ ఫ్రీ నెంబరు సమాచారం ఇవ్వాలన్నారు.

కొత్తూరు తహసీల్దార్‌కు రక్షణ కల్పించాలి

అరసవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరు తహసీల్దార్ బాలకృష్ణకు రక్షణ కల్పించాలని, ఆయనపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని దళిత ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన మందిర్‌లో సమావేశం నిర్వహించారు. కొత్తూరు తహసీల్దార్‌పై అదే మండలానికి చెందిన అగ్రకుల స్థులు దాడి చేసి తిరిగి అతనిపై తప్పుడు కేసు పెట్టారన్నారు.. ఇంత దారుణానికి ఒడిగట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘాల నేతలు దుర్గాసి గణేష్, మిస్కా కృష్ణయ్య, చీర రమేష్, పడాల ప్రతాప్, రాకోటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి

● ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే, పీయూసీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నూతన ఉపాధ్యాయులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు కృషి చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. నియోజకవర్గం నుంచి డీఎస్సీ-2025 ద్వారా 66 మంది ఉపాధ్యాయులుగా నియమితులవడం ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగస్వామ్యం కావాలని సూచించారు. కేజీబీవీలకు అదనపు గదులు, సౌకర్యాల కోసం ప్రభుత్వం ఎక్కువ నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ రామ్మోహన్‌రావు, సూరపునాయుడు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ శిమ్మ మాధవి, టీడీపీ నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, నూకరాజు, చిగురుపల్లి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఉపాధి కల్పనే 'ఎర్రన్న విద్యా సంకల్పం' లక్ష్యం

అరసవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): యువతకు చక్కని ఉపాధి కల్పన అందజేయడమే 'ఎర్రన్న విద్యాసంకల్పం' లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక కాకినాడ ఆదిత్య కళాశాలలో ఆర్ఆర్‌బీ గ్రూప్-డి మాక్ టెస్ట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుద్యోగులను ప్రోత్సహించి, వారికి ప్రభుత్వోద్యోగాలు లభించే లా ప్రోత్సహిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



మాక్ టెస్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అరసవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదీ అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో 'డిజిటల్ క్రియేట్ మూమెంట్, ఈకో-75' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నా రు. శ్రీకాకుళం ఏర్పడి 75 వసంతాల సందర్భంగా మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డిప్యూటీ డీఎఫ్‌వో నాగేంద్రరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్, హారికా ప్రసాద్, పాలకొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐ క్విస్ట్‌లో సుమిత్‌కుమార్ ప్రతిభ

● మహారాష్ట్ర సీఎం చేతులమీదుగా బహుమతి

కవిటి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీపీఎల్ భారత్ ఏఐ క్విస్ట్-2025లో భాగంగా దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోటీలో కవిటి మండలం ఆర్.బెలగాం గ్రామానికి చెందిన రత్నాల సుమిత్‌కుమార్ విజేతగా నిలిచాడు. ఆధునిక డేటా సైన్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ)లో మంచి నైపుణ్యం ప్రదర్శించి ప్రథమ స్థానాన్ని సంపాదించాడు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ క్విస్ట్-2025 వేదికపై సుమిత్‌కుమార్‌కు మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే రూ.5 లక్షల నగదు పురస్కారం అందించి అభినందించారు. ఆన్‌లైన్ టెస్ట్, కోడ్, డేటా సైన్స్ చాలెంజ్, అడ్వాన్స్‌డ్ ఏఐ వర్క్‌షాప్ వివిధ దశల్లో నిర్వహించారు. వీటిలో ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలు డేటా ఆధారంగా సమస్యాత్మకమైన సమస్యలను పరిష్కరించడంలో అసాధారణ ప్రతిభను సుమిత్ ప్రదర్శించాడు. సుమిత్ హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ ఐటీ చదువుతున్నాడు. భారతీయ బ్యాంకింగ్ డేటా సెక్యూరిటీ, పేమెంట్ సిస్టమ్‌లలో ఏఐ సొల్యూషన్‌లు అందించడమే లక్ష్యమని సుమిత్‌కుమార్ పేర్కొన్నాడు. అలాగే తెలుగు ఆధారిత ఏఐ అప్లికేషన్ అభి వృద్ధిపై పనిచేస్తున్నానన్నాడు. ఈ సందర్భంగా సుమిత్‌ను తల్లిదండ్రులు కామేశ్వరరావు, ప్రమీల, మండల సొండికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు అభినందించారు.



సుమిత్‌కుమార్‌కు చెక్కును అందిస్తున్న మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

సోంపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాల గ్రౌండ్ సమీపంలో స్కేటింగ్ రింక్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ, జిల్లా స్పీడ్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి చంద్రావతి, స్కేటింగ్ రింక్ ఫౌండర్ టంకాల బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దు కుమార్, బీన ఆనంద్, చిత్రాడ శ్రీనివాసరావు, చిత్రాడ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



స్కేటింగ్ రింక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.మేరీ క్యాథరిన్



ర్యాలీ నిర్వహిస్తున్న వసతి గృహ విద్యార్థినులు

అరసవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బాలికలు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.కె.అనిత అన్నారు. అంతర్జాతీయ బాలికా వారోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో వసతిగృహ విద్యా ర్థినులతో బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష చూపరాదని, బాలికలు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారులు ప్రమీల, సరిత, శ్రీదేవి, పూర్ణ, లక్ష్మి, అరవింద, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజు రూ.6 లక్షల ఆదాయం

● అరసవల్లికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన క్యూలైన్‌లు

అరసవల్లి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులతో అన్ని క్యూలైన్లు కిటకిట లాడాయి. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.6,06,183 ఆదాయం లభించింది. వీటిలో టిక్కెట్ల ద్వారా రూ.3,16,500, విరాళాలు రూ.80,073, ప్రసాదాల విక్రయం వల్ల రూ.2,09,610 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీకూర్మనాథుని సేవలో ఆండవన్ పీఠాధిపతి



ఆలయంలో శ్రీనివాస గోపాలదేశికన్ స్వామి

గార, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీకూర్మనాథుని ఆదివారం సాయంత్రం పుండరీకపురం ఆండవన్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీనివాస గోపాల దేశికన్ శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. వీరు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆల య చరిత్ర ను అర్చకులు వివరిం చారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మ నాభాచార్యులు, అధ్యాపక స్వామి టీపీ శ్రీనివాసాచార్యులు, అర్చకులు పాల్గొన్నారు.

రోడ్లపై పశువులతో ఇబ్బందులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో పశువులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులు గుంపులుగా రోడ్లపై తిరుగుతుండడంతో వాటిని తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులను నియంత్రించాల్సిన మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమ ర్శలు వినిపిస్తున్నాయి. ప్రధాన జంక్షన్‌లు, మార్కెట్, దాసన్నపేట, బస్టాండ్ జంక్షన్, మునిసిపల్ కార్యాలయం జంక్షన్ వద్ద పశువులు రోడ్డుపైనే ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



మునిసిపల్ కార్యాలయం జంక్షన్ వద్ద రోడ్లపై తిరుగుతున్న పశువులు

కాలిబాట వంతెన లేక ఇక్కట్లు

సోంపేట రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం-ఎకువూరు గ్రామాల మధ్య ఉప్పుటేరుపై వంతెన నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సిమెంట్ పైపులు వేసి కాలిబాట వంతెన తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే శాశ్వత వంతెన పనుల్లో జాప్యంతో నెల రోజుల కిందట ఉప్పుటేరుపై ఆధారపడి బతుకుతున్న కండ్ర కులస్థులు తాత్కాలిక వంతెనను పాక్షికంగా తొలగించారు. ఆ తరువాత వర్షాల కారణంగా మిగిలిన మార్గం కూడా కొట్టుకుపోయి కేవలం సిమెంట్ పైపులే కనిపిస్తున్నాయి. ఈ ఘటన జరిగి రెండు వారాలు దాటినా స్థానికంగా ఉన్న ప్రజా ప్రతి నిధులు అటుగా చూసి వెళుతున్నారు తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు లేవని ఉప్పలాం, సిరిమామిడి, మామిడిపల్లి, గొల్లవూరు పంచాయతీ పరిధిలోని అనేక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో పలు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపించాలని మత్స్యకార గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కొట్టుకుపోయిన తాత్కాలిక కాలిబాట వంతెన

సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలు



ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ఆర్జీయూకేటీ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతతోనే నూతన ఆవిష్కరణలకు అవకాశం కలుగుతుందని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఆప్షన్ మేట్ రీసెర్చ్ అండ్ కన్స ల్టింగ్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ (హైదరాబాద్)తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ఈ క్యాంపస్‌లో డాక్టర్ ఏపీ అబ్దుల్ కలాం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలకు ఇంక్యుబేషన్ సెంటర్ వేదిక కావాలన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందన్నారు. ఆప్షన్ మేట్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.శశికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సృజనాత్మకత ఆలోచనలతో ముందుకు వస్తే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక సాయం అందిస్తా మన్నారు. కార్యక్రమంలో క్యాంపస్ పరి పాలనాధికారి డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ ఎస్.రామకృష్ణ, ఎఫ్‌వో సీహెచ్ వాసు, ఇంక్యుబేషన్ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్.సతీష్ పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని మాజీ మంత్రి, వైసీపీ నేత సీదిరి అప్పలరాజు కోరారు. పెద్దపాడులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కురపాంలోని హెపటైటిస్-ఏతో విద్యార్థినులు కేజీహెచ్‌లో చేరడం ఇందుకు నిదర్శనమన్నారు. గుంటూరు జిల్లాలో అన్నిప్రరులో ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రిలో చేరారన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యులు అందరూ సమ్మె చేస్తు న్నారన్నారు. ఈ నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య విద్యపై అవగాహన లేని వారందరూ కాలేజీలపై వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు.

పెచ్చులూడి.. ప్రమాదకరంగా మారి

● ఇదీ హరిపురం పశువైద్యశాల పరిస్థితి

హరిపురం,అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని హరిపురంలోగల పశు వైద్యశాల శిథిలావస్థలో చేరుకుంది. గోడలుబీటలు వారి, శ్లాబ్‌ పెచ్చులూడుతుండడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడుఎటువంటి ప్రమాదం సంభవిస్తోందనని వైద్యు లు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని 65గ్రామాల పశువులకు వైద్యసేవలు అందజేస్తున్న ఈ ఆసుపత్రి భవనం 45 ఏళ్ల కిందట నిర్మించారు. దీంతో అప్పటినుంచి కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులు రాలిపోయి గోడలు బీటలు వారడంతో ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు.పశువైద్యశాల దుస్థితి గురించిప్రజాప్రతినిధులకు పలుసార్లు విన్నవించినా కనీసం స్పందన లేకుండాపోయిందని పలువురు రైతులు వాపోతున్నారు.



శిథిలావస్థలో హరిపురం పశువైద్యశాల

మురుగు చేరుతుందని ఖాళీ చేయించారు

●ఇదీ కొత్తూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం పరిస్థితి

కొత్తూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరులోని ఎస్సీ బాలుర వసతిగృహం నిరుపయోగంగా మారింది. అలికాం-బత్తిలి రహదారిలో ఎస్‌వీజీవీ బ్యాంకు ఎదురుగాఉన్న వసతిగృహం వర్షంపడితే ఆవరణలోకి మురుగునీరు వస్తుందన్న నెపంతో ఏకంగా వసతిగృహాన్ని ఖాళీచేయించారు.ఇక్కడి ఉంటున్న 35 మందిని ఏడాది కిందట బీసీ హాస్టల్‌లోకి తరలించారు. ఆ భవనం పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉండడంతో రాకపోకలకు విద్యార్థులు అవస్థలకు గురవుతున్నారు. దీనికితోడు హాస్టల్‌ సమీపంలో డంపింగ్‌ యార్డు ఉండడంతో విద్యార్థులు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. వసతి సౌకర్యంలేక కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు పరాయి పంచన విధులు నిర్వహిస్తుంటే అన్ని వసతులు ఉన్నా ఇక్కడి హాస్టల్‌ను తరలించడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి.



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పలాస, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):పలాస జీఆర్పీ పరిధిలోగల బారువ-మందస రైల్వే స్టేషన్ల మధ్య రైల్వేట్రాక్‌లో 35 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని రైల్వేపోలీసులు తెలిపారు. శనివారం సాయంత్రం రైలుకింద పడి మృతిచెందాడని, ఆదివారం మృత దేహాన్ని స్వాధీనం చేసుకొని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు చెప్పారు. ఆయన ఛాతీపై ఐలవ్‌యు స్వాతి అన్న పచ్చబొట్టు తెలుగులో రాసి ఉందని తెలిపారు. ఆయనకు చెందిన సమాచారం తెలిస్తే రైల్వేపోలీసులకు తెలియజేయాలని కోరారు.

రాజమహేంద్రవరంలో మత్స్యకారుడి మృతి



చిరంజీవి(ఫైల్‌)

సంతబొమ్మాళి,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలోని లక్కివలస పంచాయతీ పరిధిలోని గెద్దలపాడు గ్రామానికి చెందిన మత్స్యకారుడు తుంబల చిరంజీవి(25) రాజమహేంద్రవరంలో మృతి చెందాడు.గ్రామస్థులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. రాజమహేంద్రవరంలో తుంబల చిరంజీవి హోటల్‌లో ఐదేళ్లగా కుక్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామం వచ్చి పదిరోజుల కిందటే అక్కడికి వెళ్లాడు. శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెళ్తున్న చిరంజీవి ఓవర్‌ టేక్‌ చేయబోయి లారీ కింద పడి మృతిచెందాడు. కుమారుడు మృతి చెందినట్లు తెలుసుకున్న తండ్రి గురువులు తల్లి ఆదెమ్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నందిగాం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని లఖిదాసుపురం గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసునమోదుచేసినట్లు ఎస్‌ఐ షేక్‌మహమ్మద్‌ ఆలీ తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆఖరిసంవత్సరం చదువుతున్న లోకనాధం సుస్మిత శనివారం ఉదయం కాలేజీకి వెళ్తానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదని చెప్పారు.దీంతో సుస్మిత పెద్దనాన్న వాసుదేవరావు ఆమె ఆచూకీకోసం వెతికారని తెలిపారు.ఆచూకీ లభించకపోడంతో ఆదివారం నందిగాం పోలీసులకు ఫిర్యాదుచేశారని చెప్పారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సుస్మిత తల్లిదండ్రులు ఉపాధికోసం వలస వెళ్లగా పెద్దనాన్న ఇంటి వద్ద ఉండి చదువుతోందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

పొందూరు,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని లోలుగు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం లోలుగుకు చెందిన లోలుగు హరికృష్ణ, చౌళ్ల ప్రసాద్‌ చిలకపాలెం నుంచి బైక్‌పై వస్తూ పొందూరు నుంచి చిలకపాలెం వెళుతున్న ఆటో లోలుగు మలుపువద్ద ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లోలుగు హరికృష్ణ, చౌళ్లప్రసాద్‌తో పాటు ఆటోలో ఉన్న దోరడ్ల దీన్‌కుమార్‌ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్సనిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదిని శిక్షించాలి

పాతపట్నం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్‌ గవాయ్‌పై బూటువిసిరిన న్యాయవాదిని వెంటనే శిక్షించాలని అంబేడ్కర్‌ యువజన సంఘం పాతపట్నం శాఖ డిమాండ్‌చేసింది. ఆదివారం పాతపట్నం కోర్టుకూడలిలో గవాయ్‌పై బూటువిసిరిన న్యాయవాది రాకేశ్‌ కిషోర్‌ను శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ నిరసనతెలిపింది. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రాకేశ్‌ కిషోర్‌ను శిక్షించే వరకూ తమపోరాటం సాగుతుందని తెలిపారు.కార్యక్రమంలో సంఘ నాయకులు టి.లక్ష్మీనారాయణ, సిర్ల ప్రభాకరరావు, సిర్ల జోగారావు నవగాన రత్నకుమార్‌ యజ్జల భాస్కరరావు, బోయిన శ్రీరాములు, పొడ్డి కృష్ణారావు, బి.గోపాలరావు, బి.రవి, కె.గోవిందరావు, చంద్రశేఖర్‌, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంపై సీబీఐతో దర్యాప్తు చేయాలి

టెక్కలి, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):మద్యం కుంభకోణంపై సీబీఐతో దర్యాప్తుచేయాలని టెక్కలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పేడాడ తిలక్‌ ఒకప్రకటనలో కోరారు.అధిష్టానం పిలుపుమేరకు సోమవారం టెక్కలిలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

టెక్కలిలో ఆర్‌ఎస్‌ఎస్‌ శతాబ్ది ఉత్సవాలు

టెక్కలి అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):టెక్కలిలో ఆర్‌ఎస్‌ఎస్‌ శతాబ్ది ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవాహ మాధవ్‌ పాత్రో పంచపరివర్తన గురించి వివరించారు. వేడుకల్లో 100 మంది గణవేశ్‌ దారి స్వయం సేవకులు, హిందూబంధువులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని ఆనందరావు, టెక్కలి ఖండకార్యవాహ కాంతారావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

తిమడాంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

జలుమూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమడాం ఉన్నతపాఠశాలలో 1985-86లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయకలయిక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం అప్పటిలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు పూర్వవిద్యార్థుల జ్ఞాపకార్థం పాఠశాల వరకు సీసీరోడ్డు నిర్మాణానికి జడ్పీ నిధుల నుంచి మూడు లక్షలు రూపాయలు మంజూరుకు హామీఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు దవళ సరస్వతి పాల్గొన్నారు.



ఆనాటి ఉపాధ్యాయులతో 1985-86 బ్యాచ్‌ విద్యార్థులు

సత్యవరంలో తాగునీటి కష్టాలు

● ఐదు రోజులుగా ట్యాంకుల ద్వారా పంపిణీ

నరసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పంచాయతీ పరిధిలో గల సత్యవరం గ్రామంలో ఐదురోజులుగా తాగునీరు కోసం గ్రామస్థులు కష్టాలుపడాల్సివస్తోంది. గ్రామానికి తాగునీరు పంపిణీ చేసి రక్షిత మంచినీటి పథకం వద్ద నీటిని స్టోర్‌ చేసే వ్యవస్థ దెబ్బతింది. దీంతో గ్రామంలో ఐదురోజులగా తాగునీరు సరఫరాకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నరసన్నపేట పైడితల్లి జంక్షన్‌ వద్దకు మంచినీటి కుళాయిల వద్దకు వచ్చి తాగునీరు తీసుకువెళ్లాల్సివస్తోంది. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను పంచాయతీ దృష్టికి కొందరు తీసుకెళ్లవడంతో ట్యాంకర్లతో తాగునీటి పంపిణీచేపట్టారు. కాగా రక్షిత పథకం వద్ద వాల్స్‌ దెబ్బతిన్నాయని, వీటిని విజయవాడ నుంచి తెప్పించి పూర్తిస్థాయిలో తాగునీరందిస్తామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.



ట్యాంకు వద్ద నీటికోసం క్యూలైన్‌లో ఉన్న మహిళలు

సందడిగా నందెన్నల నిమజ్జనం

● ఆకట్టుకున్న పగటి వేషధారణలు



బెజ్జిపల్లిలో నందెన్నను ఊరేగిస్తున్న గ్రామస్థులు

జిల్లాలో పలుచోట్ల నందెన్న నవరాత్రులు ముగిశాయి. ఆదివారం నందెన్నలను ఊరేగించి జలాశయాల్లో నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా గ్రామాల్లో ప్రదర్శిస్తున్న పగటి వేషధారణలు ఆకట్టుకున్నాయి.

●వజ్రపుకొత్తూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అక్కుపల్లి, చినవంకలో నందెమ్మ ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా పగటివేషాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా ఉత్సవాలను నిర్వహించారు.

●కోటబొమ్మాళి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీలో గల చిన్నహరిశ్చంద్రపురంలో గౌరీపౌర్ణమి, నందెన్న నవరాత్రులు ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామస్థులు ప్రదర్శించిన పగటి వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి చెందిన రోణంకి చలపతిరావు గ్రామ అమ్మవారు వేషధారణలో పాటు కోట రమణమూర్తి, బగాది ఈశ్వరరావు, దుంపల వెంకటరమణలు అలనాటి పాత్రలు పోషించి కట్టుబొట్టు విధానాలను తెలియజేశారు.



కోటబొమ్మాళి: పగటివేషం ప్రదర్శిస్తున్న దృశ్యం

●నందిగాం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి):బెజ్జిపల్లిలో గౌరీపౌర్ణమి పురస్కరించుకుని ఏర్పాటుచేసిన నందెన్నను నిమజ్జనం చేశారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నందెన్నను పగటి వేషాలమధ్య ఊరేగించి స్థానిక చెరువలో నిమజ్జనం చేశారు.

●పోలాకి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి మెండవీధిలో కొలువుదీరిన గౌరమ్మకు భక్తులు దీపాలతో పూజలు చేస్తూ భజనలు, గ్రామీణ గేయాలు ఆలపిస్తున్నారు. ఆదివారం ప్రత్యేక వేషధారణలో భక్తులు పూజలు చేశారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

● వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం



అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని నిమ్మాడలోగల క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బారు నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన ప్రజలనుంచి వినతులుస్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలుకల్పించాలని, నూతనంగా పింఛన్లు, గృహాలు మంజూరుచేయాలని వినతులు అందజేశారు.ప్రజల నుంచి వచ్చిన వినతులు పరిశీలించి సంబందిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా ప్రజలకు మేలు చేసే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని,ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించేందుకు చేపడుతున్న పనులువేగవంతంచేయాలని అధికారులను ఆదేశించారు.విధుల్లో అలసత్వం లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ప్రతి కుటుంబానికి మెరుగైన ఆదాయం, జీవనోపాధి కల్పించేలక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ మాజీ అధ్యక్షుడు హరివరప్రసాద్‌ పాల్గొన్నారు.

● టెక్కలి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మౌలికవసతులు పెంపొందించాలని మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తెలిపారు.టెక్కలిలో స్థానిక పంచాయతీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. టెక్కలిలో ప్రత్యేకంగా శానిటేషన్‌ పనులను చేపట్టాలన్నారు.రక్షిత మంచినీటి సరఫరా,వీధిలైట్లు, ప్రధాన రహదారి నవీకరణ చేయాలన్నారు. రోడ్లపై కుక్కలు సంచారాన్ని నియంత్రించాలని కోరారు. ఇంటిపన్నులు, సెస్‌ సక్రమంగా వసూలు చేయాలన్నారు.

మోటారు రంగాన్ని కాపాడండి



మాట్లాడుతున్న లారీ అండ్‌ మిల్లర్ల ఓనర్స్‌ అసోసియేషన్‌ నాయకులు

నరసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌ సీజన్‌కు సంబంధించి బియ్యం రవాణాచేసే లారీల కిరాయి నిబంధనల మేరకు నిర్ణయించి మోటారు రంగాన్ని కాపాడాలని లారీ ఓనర్స్‌ అసోసియేషన్‌ నాయకులు, మిలర్లు తంగుడు నాగేశ్వరరావు, సీతారామరాజులు కోరారు. ఆదివారం నరసన్నపేటలో లారీ ఓనర్స్‌ అండ్‌ మిలర్స్‌ ఓనర్స్‌అసోసియేషన్‌ సమావేశంనిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా లారీ కిరాయిలను నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో వాన గోవిందరాజులు, పంచిరెడ్డి మురళి, పంచిరెడ్డి జగ్గన్న, రావాడ భాస్కరరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

●నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఆదివారం నరసన్నపేట పంచాయతీలోని 12వ వార్డు శివనగర్‌కాలనీలో రూ.1.5 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్డు, ఇంటింటా తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో వెనుకబడిన ప్రాంతాల్లో శతశాతం రోడ్లు, తాగునీటి సదుపాయం, డ్రైనేజీలు నిర్మించి అభివృద్ధి చేసే దిశగా అన్ని విధాల కృషి చేస్తున్నామని తెలిపారు.కార్యక్రమంలో నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, పొందర, కూరాకుల కార్పొరేషన్‌ చైర్మన్‌ దామోదర నర్సింహులు, శిమ్మ చంద్రశేఖర్‌, ఉపసర్పంచ్‌ సాసుపల్లి కృష్ణబాబు, గొద్దు చిట్టిబాబు, జామి వెంకటరావు, ఉణ్న వెంకటేశ్వరరావు, సరియపల్లి మధు, బైరి భాస్కరరావు , బోయన సతీష్‌, కింజరాపు రామారావు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

●పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

ఎల్‌.ఎన్‌.పేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మహిళల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. ఆదివారం మండలంలోని పెద్దకోటలో పీఏసీఎస్‌అధ్యక్షుడు కె.మన్మథరావు ఆధ్వర్యంలో చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దశలవారీగా నెరవేర్చుతున్నారని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్‌ సిలిండర్లను ఇప్పటికే అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళలకు డ్వాక్రాసంఘాలద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందజేసి ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు బ్యాంకుల ద్వారా అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా స్థిరపడితే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన జరుగుతోందన్నారు. రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం. మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, బీఆర్‌ఆర్‌ వంశధార ప్రాజెక్టు జిల్లా వైస్‌చైర్మన్‌ వి. ఆనందరావు, నాయకులు గోవిందరావు, ఎస్‌. తేజేశ్వరరావు, ఎ.పోలినాయుడు పాల్గొన్నారు.



మహిళలకు చీరలను పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యం

మందస, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని గోగ్రీన్‌ ఆర్గనైజేషన్‌ సభ్యులు గిన్ని తిరుపతిరెడ్డి, జనసేన జిల్లా నాయకులు సంతోష్‌పండా తెలిపారు. ఆదివారం మందస పాతతహసీల్దార్‌ కార్యాలయంనుంచి శాసనంవీధి జంక్షన్‌ వరకూ మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో గోగ్రీన్‌ సభ్యులు లక్ష్మణరావు, పట్నాల మోహనాచారి, మామిడి కోదండరావు, శ్రీనివాస్‌ పాఢి, రామారావు, సింహాచలపతి, మల్లా రెడ్డిరాజు, దున్న హరికృష్ణ, కె.ప్రసాద్‌, నాగేశ్వరరావు, కేశవరావు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

హిరమండలం,అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి):మండలంలో పలు కూడళ్ల,ఆలయాల వద్ద ఆదివారం ఎస్‌ఐ వెంకటేష్‌ ఆధ్వర్యంలో సీసీకెమెరాలు ఏర్పాటుచేశారు. శాస్త్రులపేట కూడలి,హిరమండలం పొలిమేరల్లో, కొత్తూరు రోడ్డువద్ద, పలు ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.చోరీలు అరికట్టేందుకు, నేరస్థులను పట్టుకునేందుకు కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు.

కాలనీ వాసులకు న్యాయం చేసేందుకు కృషి

హిరమండలం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి):పాతహిరమండలం సమీపంలో వంశధార నదిపక్కన వైసీపీ ప్రభుత్వం కేటాయించిన జగనన్న కాలనీ పేదల పాలిట శాపంగా మారిందని జడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక అధికారుల ద్వారా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టరు దృష్టికి తీసుకు వెళ్లి కాలనీ వాసులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.ఆదివారం హిరమండలంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ముందు చూపులేకుండా వంశధార నదిపక్కన లోతట్టు ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి అన్యాయం చేసిందన్నారు. ఇటీవల వంశధార నదికి వచ్చిన వరదలకు కాలనీ మొత్తం నీట మునిగిపోవడంతో అక్కడ నివాసముంటున్న వారిని పునరావాస కేంద్రానికి తరలించాల్సి వచ్చిందని చెప్పారు.ఆ ప్రదేశంలో ఇళ్ల నిర్మాణానికి అనువుగా ఉండదని గతంలో అధికారులు, అప్పటి నాయకులకు తెలియజేసినా స్థలాలు మంజూరులో మొండిగా ముందుకువెళ్లారన్నారు.ఇళ్లనిర్మాణం చేయకపోతే స్థలాలు రద్దుచేస్తామని చెప్పడంతో 25 మంది నిర్మాణాలు జరిపారన్నారు. ఇప్పుడుఏ వీరి పరిస్థితి అయోమయంగా ఉందని, లక్షలు ఖర్చుచేసి ఇళ్లు కటుకుంటే నివాస యోగ్యంగా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):ప్రతి వ్యక్తి ఆధ్యాత్మిక చింతన కలిగిఉండాలని లైదాం వివానందాశ్రమ ప్రవచకుడు యాలాలశ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం చింతాడపేట స్వామి రామ యోగిసేవాశ్రమంలోసత్సంగం నిర్వహించారు సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన సమావేశంలో బి.అప్పలనాయుడు, సింగుపురం లక్ష్మణరావు, అనంతస్వామి పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

నరసన్నపేట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక జమ్ము జంక్షన్‌ వద్ద 324ఏ ఎన్‌హెచ్‌పై 108 వాహనంలో ఆదివారం రాత్రి మహిళ బిడ్డకు జన్మనిచ్చింది. సారవకోట మండలం మాళవకు చెందిన బసుగారి లలిత పురిటినొప్పులతో బాధపడుతుండంతో కుటుంబసభ్యులు పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యులు రిమ్స్‌కు రిఫర్‌ చేయగా 108లో తరలిస్తుండగా లలితకునొప్పులుఎక్కువ కావడంతో 108వాహనాన్ని పక్కకు నిలిపివేశారు. వాహనంలో సిబ్బంది వైద్య సేవలందించడంతో లలిత సుఖవంతంగా ప్రసవమై ఆడపిల్లకు జన్మనిచ్చింది. సిబ్బంది రాంబాబు, హరికృష్ణలను లలిత కుటుంబసభ్యులు అభినందించారు.

యథేచ్ఛగా కంకర డంపింగ్‌

●కంబిరిగాం గెడ్డకు ఆనుకొని పోగులు పోస్తున్నవైనం ● చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం

పలాసరూరల్‌,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని కంబిరిగాంగెడ్డకు ఆనుకొనిఉన్న స్థలంలో కంకరను డంపింగ్‌ చేస్తు న్నారెవెన్యూఅధికారులు చోద్యంచూస్తుండడంపై సర్వత్రా విమర్శలొస్తున్నాయి. ఈ మార్గంలోనే అధికారులు సచివాలయానికి వెళ్తుంటారు. రెవెన్యూ, మైనింగ్‌శాఖల నుంచి ఎటువంటి అనుమతి, సమాచారం లేకుండా కొందరు వ్యక్తులు మట్టి, కంకరను ఎక్కడినుంచో తీసుకొచ్చి ఖాళీస్థలంలో పోగులుపోస్తున్నారు. బహిరంగాప్రదేశంలో అనుమతి లేకుండా కంకర వేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో కంకర డంప్‌చేస్తున్నా అధికారులు పరిశీలించకపోవడం విశేషం. కాగా కంబిరిగాంగెడ్డకు ఆనుకొని కంకర పోగులు వేస్తుండడంపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి తహసీల్దార్‌ గిరి తెలిపారు.



కంబిరిగాం వద్ద కంకరను డంపింగ్‌చేసిన దృశ్యం